తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

Epaper : WWW.tharangalu.comEpa

ఎడిటర్ : గడ్డం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
8 ఏప్రిల్ 2024
సంపుటి : 01
సంచిక : 311
పేజీలు : 8
వెల రూ.5.00

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## జన జాతర కాదు అబద్ధాల జాతర



- లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా స్పందించరా,
- మా అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదా?,
- కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలుగా నయవంచన చేస్తుంది
- న్యాయ్ పేరుతో నయా నాటకానికి తెరతీశారా : కేటీఆర్

**తరంగాలు-హైదరాబాద్:**

కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేశారు. అది జనజాతర సభ కాదని, హామీల పాతర.. అబద్ధాల జాతర సభ అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరిట గారడి చేసిన రాహుల్ గాంధీ.. పార్లమెంట్ ఎలక్షన్లలో న్యారు పేరిట నయా నాటకానికి తెరతీశారా అని ప్రశ్నించారు. తెలంగాణకు తీరని అన్యాయం చేసి.. ఇప్పుడొచ్చి న్యారు అంటే నమ్మేదెవరని ఎక్స్ వేదికగా నిలదీశారు. నమ్మి ఓటేసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ నాలుగు నెలలుగా నయవంచన చేస్తున్నదని విమర్శించారు. అసత్యాలతో అధికారంలోకి వచ్చి అన్నదాతలను ఆత్మహత్యల పాల్జేస్తున్నదని, నేతన్నల బలవన్మరణాలకు కారణమవుతున్నదని ఆరోపించారు. గ్యారెంటీలకు పాతరేసి, అసత్యాలతో జాతర చేస్తున్నదని -మిగతా 2 లో

## అధికారులకు తీహార్ సవాల్

- వీవీఐపీ ఖైదీలు పెద్ద ఇబ్బంది వారిని చాలా జాగ్రత్తగా ఉంచాలి
- ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ సూచన




**తరంగాలు-న్యూఢిల్లీ :**

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఇటీవలే తరలించిన ప్రసిద్ధ జైలు తీహార్‌లోని వీవీఐపీ ఖైదీలు అధికారులకు పెద్ద ఇబ్బంది అని ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ చెప్పారు. ఖైదీల మధ్య ఇతర దాడుల కారణంగా వారిని సురక్షితంగా ఉంచాలని తెలిపారు. గతంలో ఈయన జైళ్ల డైరెక్టర్ జనరల్‌గా కూడా పనిచేశారు. తీహార్ జైలులో తన పదవీకాలంలో గరిష్ట సంఖ్యలో -మిగతా 2 లో

## ప్రజాపాలన కాదు... ప్రతీకార పాలన

- గ్యారెంటీల ప్రభుత్వం కాదిది గారడీ సర్కారు
- తెలంగాణవాదులకు, ద్రోహులకు మధ్య పోరు
- పదేండ్ల అభివృద్ధికి, 100 రోజుల అబద్ధాలకు మధ్యే లోక్‌సభ ఎన్నికలు: ఆర్ఎస్ ప్రవీణ్

**తరంగాలు-కరీంనగర్**




కాంగ్రెస్ ప్రజా పాలనను వదిలి ప్రతీకార పాలనను కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన జనజాతర సభలో 'జైలులో పెడుతాం.. అక్కడే డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తాం' అని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడాల్సిన మాటలేనా? అని ప్రశ్నించారు. తాము ప్రజల సమస్యలపై -మిగతా 2 లో

## మళ్లీ మోడీ గెలిస్తే ప్రజాస్వామ్యమే ఉండదు



- ఎన్నికల వేళ ప్రతిపక్షాలే లక్ష్యంగా దాడులు, అరెస్టులు
- దర్యాప్తు సంస్థల ద్వారా అణచివేతలు
- దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చే ప్రయత్నం
- వైస్రాయ్‌ల పాత్ర పోషిస్తున్న గవర్నర్లు: సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ఆగ్రహం
- మదురైలో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

**తరంగాలు-మదురై :**

కేంద్రంలో నరేంద్ర మోడీ, బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యమే ఉండదని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాశ్ కరత్ చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. తమిళనాడులోని మదురై లోక్‌సభ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటేశన్‌కు మద్దతుగా శనివారం జరిగిన బహిరంగ సభలో కరత్ ప్రసంగించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నేతలను బీజేపీ లక్ష్యంగా ఎంచుకున్నదని ఆయన ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌ను అరెస్ట్ చేశారని, ఓ వైపు ఎన్నికల ప్రచారం జరుగుతుంటే మరోవైపు ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. -మిగతా 2 లో



## కారు దిగిన తెల్లం

-కండువా కప్పి ఆహ్వానించిన రేవంత్ రెడ్డి

**తరంగాలు-హైదరాబాద్**

భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన హస్తం గూటికి చేరారు. సీఎం రేవంత్ ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కీలక నేత, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న తెల్లం వెంకట్రావ్ శనివారం జరిగిన తక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన జనజాతర సభకు హాజరయ్యారు.

## ఎవరి వ్యూహం వారిదే

- పార్లమెంట్ ఎన్నికలకు సరికొత్త వ్యూహాలు
- ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలతో హడావుడి
- అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్
- 'మల్కాజిగిరి' సెగ్మెంట్ పరిధిలో వేడెక్కిన రాజకీయాలు




**తరంగాలు సిటీబ్యూరో**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల విజయం కోసం సరికొత్త వ్యూహాలతో ముందుకెళు_న్నాయి. కొత్త ఒరవడితో ఆత్మీయ సమ్మేళనాలు, ప్రచార ప్రణాళికలను అమలు చేసే పనిలో పోటాపోటీగా వ్యవహరిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్, -మిగతా 2 లో

## వాచీల స్మగ్లింగ్ కేసులో పొంగులేటి కొడుకు!

- విచారణకు రావాలని మంత్రి తనయుడికి చెన్నై కస్టమ్స్ అధికారుల నోటీసులు
- డెంగ్యూతో బాధపడుతున్న.. 27న వస్తా: హర్ష
- కేసులో తన ప్రమేయం లేదని వివరణ



**తరంగాలు-హైదరాబాద్,**

(నమస్తే తెలంగాణ): ఖరీదైన చేతి గడియారాల అక్రమ రవాణా కేసులో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కొడుకు పొంగులేటి హర్షరెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. అధికారులు గత నెల 28న నోటీసులు ఇచ్చినట్టు, ఈనెల 4న (గురువారం) విచారణకు హాజరుకావాలని అందులో సూచించినట్టు సమాచారం. అయితే డెంగ్యూ -మిగతా 2 లో

తరంగాలు
Tharangalu Daily News Paper

# జన జాతర కాదు
## అబద్ధాల జాతర..

(మొదటి తరువాయి)

ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని, అధికారంలోకి వచ్చాక నరకం చూపిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ అసమర్థ పాలనలో సాగునీరు లేక అన్నదాతలు పంట నష్టపోతున్నారని చెప్పారు. రుణమాఫీ లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, తాగునీటికి తెలంగాణ ప్రజలు తండ్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ మోసాలపై మహిళలు మండిపడుతున్నారని పేర్కొన్నారు.రాహుల్ గారు.. మా అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదా?, లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా స్పందించరా, 200కిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఆదుకోరా?, చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయినా కనికరించరా?, డిసెంబర్ 9న చేస్తానన్న రుణమాఫీపై సర్కారును నిలదీయరా అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు. 75 ఏండ్ల స్వాతంత్ర భారత చరిత్రలో దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇంకా వెనకబడి ఉన్నారంటే కారణమే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. కులగణన పేరిట మీ కొత్త పల్లవికి ఓట్లు రాలవని, చేతి గుర్తుకు ఓటేస్తే చేతులెత్తేయడం ఖాయమని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందన్నారు. సకల రంగాలను సంక్షోభంలోకి నెట్టిన భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకుంటే నిండా మునగడం ఖాయమని తేలిపోయిందని చెప్పారు. అందుకే వందరోజుల్లోనే హామీలను బొందపెట్టిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చేతిలో గుణపాఠం ఖాయమన్నారు.

# అధికారులకు తీహార్ సవాల్



(మొదటి తరువాయి)

వీవీఐపీలను చూసుకున్నానని చెప్పారు. "గరిష్ఠ సంఖ్యలో వీవీఐపీలను చూసుకునే ప్రత్యేక హక్కు నాకు ఉన్నది. కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణం జరిగిన సమయంలో సురేశ్ కల్మాడీ, కనిమొళి, ఏ రాజా (2జీ స్పెక్ట్రమ్ స్కామ్), రిలయన్స్, సీడబ్ల్యూజీ, అమర్‌సింగ్‌ల నుంచి ఐఏఎస్ అధికారులు, ఐపీఎస్ అధికారులు కూడా ఇందులో ఉన్నారు" అని ఆయన తెలిపారు. కేజ్రీవాల్‌తో పాటు ఆయన పార్టీకి చెందిన కీలక నాయకులు, మాజీ మంత్రులు సత్యేందర్ జైన్, మనీష్ సిసోడియా సహా పలువురు ప్రముఖులు ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న విషయం విదితమే. "వీఐపీని ఉంచినప్పుడు, వ్యక్తికి బస చేయటంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం కేజ్రీవాల్ లోపల ఉన్నారు. భద్రతా అంశాన్ని దృష్టిలో ఉంచుకుని చాలా జాగ్రత్తగా ఎంచుకున్న ప్రదేశంలో ఆయనను పెడతారు. ఎందుకంటే 'బ్లేడ్‌బాజీ' (బ్లేడ్‌లు లేదా బ్లేడ్ లాంటి వస్తువులను ఉపయోగించి దాడి చేయడం) వంటి చాలా విషయాలు జరగవచ్చు. మీరు జాగ్రత్తలు తీసుకోకపోతే, అతను దాడికి గురవచ్చు" అని నీరజ్ కుమార్ అన్నారు.

కేజ్రీవాల్‌ను దోషుల జైలులో ఉంచినట్టు మీడియా కథనాల ద్వారా తెలుసుకున్నానని కుమార్ చెప్పారు. అండర్ ట్రయల్‌లను ఉంచిన దానికంటే చాలా సురక్షితమైన, ప్రశాంతమైన ప్రదేశంలో అతన్ని ఉంచారన్నారు. నీరజ్ కుమార్ తన పదవీకాలంలో అత్యంత ప్రసిద్ధ పోలీసు అధికారులలో ఒకరు. ఢిల్లీలో సేవలందించటంపై మాట్లాడుతూ.. తనకు స్థానిక రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేనందున ఢిల్లీ పోలీసులు ఆశీర్వదించారని అన్నారు.

# వాచీల స్మగ్లింగ్ కేసులో
## పొంగులేటి కొడుకు!

(మొదటి తరువాయి)

సోకి చికిత్స తీసుకుంటున్నానని, ఈ నెల 27న హాజరవుతానని హర్ష ఈ నెల 3న సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కొన్ని జాతీయ మీడియా సంస్థలు హర్షను సంప్రదించగా.. వాచీల అక్రమ రవాణా కేసులో తనకు ప్రమేయం లేదని, నిరాధారమని చెప్పినట్టు సమాచారం. అనారోగ్యంతో కస్టమ్స్ విచారణకు హాజరు కాలేకపోతున్నానని, ఈ నెల 27న తప్పనిసరిగా హాజరై వాదనలు వినిపిస్తానని వెల్లడించినట్టు తెలిసింది.

### హాంకాంగ్ టు చెన్నై.. వయా సింగపూర్!

చెన్నై విమానాశ్రయంలో ఫిబ్రవరి 5న కస్టమ్స్ అధికారులు రెండు లగ్జరీ వాచీలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని మహమ్మద్ ఫహెర్దీన్ ముబీన్ అనే వ్యక్తి హాంకాంగ్ నుంచి సింగపూర్ మీదుగా భారత్‌లోకి తీసుకొచ్చినట్టు ఇంటెలిజెన్స్ సమాచారంతో గుర్తించారు. ఆ వాచీల్లో ఒకటి పాటెక్ ఫిలిప్ 5740, రెండోది బ్రెగ్యుట్ 2759. పాటెక్ ఫిలిప్ వాచ్‌కు మన దేశంలో ఎక్కడా డీలర్లు లేకపోవడం.. బ్రెగ్యుట్ కంపెనీల వాచీలు ఇండియా మార్కెట్‌లో స్టాక్ లేకపోవటంతో వారికి అనుమానం వచ్చింది. పరిశీలించి వాటి విలువ రూ.1.70 కోట్లపైగా ఉంటుందని తేల్చారు. దీంతో ముబీన్‌ను అరెస్టు చేసి, కోర్టు అనుమతితో విచారణ చేయగా మధ్యవర్తి నవీన్‌కుమార్ పేరును వెల్లడించారు.

మార్చి 12న అలోకం నవీన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా మరిన్ని ఆధారాలు లభించినట్టు సమాచారం. ఈ రెండు వాచీలను హర్షరెడ్డి కోసం కొనుగోలు చేసినట్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. ముబీన్‌ను లగ్జరీ వాచ్ డీలర్‌గా, నవీన్‌కుమార్ మధ్యవర్తిగా, హర్షరెడ్డి కొనుగోలుదారుడిగా అనుమానిస్తున్నారు. వాచీ కొనుగోలుకు యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ది ట్రెజరీ (యూఎస్‌డీటీ)కి చెందిన టెథర్ వంటి క్రిప్టో కరెన్సీ ఆధారంగా కొంత డబ్బు, మరికొంత హవాలా రూపంలో చెల్లించినట్టు తేలిందని కస్టమ్స్ వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే హర్షకు నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించాయి.

### మొత్తం రూ.100 కోట్లకుపైనే స్మగ్లింగ్

డబ్బున్న వ్యక్తులకు ఇలా ఖరీదైన వాచీలను సైప్లె చేయటంలో ముబీన్, నవీన్‌కుమార్ ఆరితేరినట్టు కస్టమ్స్ అధికారులు గుర్తించారు. విలాసాలకు అలవాటుపడిన వ్యక్తులకు ఇలా అక్రమమార్గంలో వాచీలను చేరవేస్తుంటారు

# మళ్లీ మోడీ గెలిస్తే..
## ప్రజాస్వామ్యమే ఉండదు

(మొదటి తరువాయి)

### ఇవేం చర్యలు?

ప్రతిపక్షాలతో బీజేపీ ప్రజాస్వామిక పద్ధతిలో పోరాడడం లేదని, వాటిని అణచివేస్తోందని కరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను ఆదాయపన్ను శాఖ స్తంభింపజేసిందని, ఆ పార్టీకి నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. కేరళలోని త్రిస్సూర్ జిల్లాలో సీపీఐ (ఎం) బ్యాంక్ ఖాతాను సైతం ఐటీ శాఖ ఫ్రీజ్ చేసిందని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 'బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రతిపక్ష నేతలను పార్లమెంట్ నుండి సస్పెండ్ చేశారు. పాత్రికేయులు, పౌర హక్కుల కార్యకర్తలను కూడా కటకటాల వెనక్కి నెట్టారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం పోరాడుతున్న సంస్థలు ఈ చర్యలను విమర్శించాయి' అని ఆయన అన్నారు.

### మందిర నిర్మాణం ఘనకార్యమా?

అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని ఓ ఘనకార్యంగా బీజేపీ, మోడీ ఎన్నికల ప్రచారంలో చెప్పుకుంటున్నారని కరత్ ఎద్దేవా చేశారు. అది ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమమని, మోడీ పురోహితుడిగా వ్యవహరించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కానందుకు ప్రతిపక్షాలను బీజేపీ విమర్శించిందని, అది ఒక రాజకీయ ప్రాజెక్ట్ అయినందునే ప్రతిపక్షాలు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించాయని తెలిపారు. మతతత్వ అజెండా కోసం మతాన్ని, రాజకీయాన్ని కలగలిపారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చేసే ఉద్దేశంతో మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు.

### బీజేపీయే అవినీతి పార్టీ

'ఇండియా కూటమిని అవినీతి పార్టీల కలయికగా బీజేపీ, మోడీ పిలుస్తున్నారు. బీజేపీయే అత్యంత అవినీతి పార్టీ అని ఎన్నికల బాండ్ల ఉదంతం నిరూపించింది. చట్టాలను సవరించి బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. విరాళాల కోసం ఖాతాలు తెరిచేందుకు సీపీఐ (ఎం) నిరాకరించింది. బాండ్ల పథకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని ఆరు సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బాండ్లలో సగానికి పైగా బీజేపీ ఖాతాలోకే చేరాయి. ప్రజలను బెదిరించేందుకు ఆ డబ్బును బీజేపీ ఉపయోగించింది. ఎన్నికల బాండ్ల ద్వారా జరిగిన మనీ లాండరింగ్, అవినీతిపై విచారణ జరపాలి. దానిని సుప్రీంకోర్టు పర్యవేక్షించాలి' అని కోరారు.

### వరదల సమయంలోనూ నిధులివ్వరు

దేశం రాష్ట్రాల సమాఖ్యగా ఉండాలా, దేశంలో ఫెడరలిజం ఉండాలా అనే అంశాలను రాబోయే ఎన్నికలు నిర్ణయిస్తాయని కరత్ చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు 'ఒకే దేశం%ొ%ఒకే భాష%ొ%ఒకే సంస్కృతి' విధానాన్ని కోరుకుంటున్నాయని తెలిపారు. ఆ పార్టీ నాయకులు దేశంలో ఒకే ఎన్నికలు ఉండాలని కూడా భావిస్తున్నారని, ఇది ఫెడరల్ నిర్మాణాన్ని నాశనం చేస్తుందని అన్నారు. పాలకులు గవర్నర్లను వాడుకుంటున్నారని, వారేమో వైస్రాయుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వరదల సమయంలో సైతం తమిళనాడుకు బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని కరత్ మండిపడ్డారు.

# ప్రజాపాలన కాదు...
## ప్రతీకార పాలన

(మొదటి తరువాయి)

నిలదీస్తుంటే వారు మాత్రం జైలు, కేసులు అంటూ ప్రతీకారం తీర్చుకునేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ ప్రజలకు.. తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. శవాలు, శివాలు అని మాట్లాడే విధ్వంసకారులను పార్లమెంట్‌కు పంపిస్తే రాజ్యాంగం భద్రంగా ఉంటుందా? అని ప్రశ్నించారు. నిత్యం ప్రజల అభ్యున్నతి కోసం, జిల్లా అభివృద్ధి కోసం పాటుపడే వారిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని దాసరి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సులో ఆయన మాట్లాడారు. ఇది పదేండ్ల కేసీఆర్ అభివృద్ధి పాలనకు, వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్ పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నికల పోరు అని ఆయన పేర్కొన్నారు. 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం వారి అడ్రస్సులు చెప్పండి, విచారణ చేసి ఎన్నికల తర్వాత ఆదుకుంటామని అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.




ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అంటూ హామీలిచ్చిందని, కానీ అది గ్యారెంటీల ప్రభుత్వం కాదని, గారడీల ప్రభుత్వమని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే పిల్లల భవిష్యత్తు అభివృద్ధి వైపుగా సాగుతుందని తెలిపారు.

### అభివృద్ధి కోసం పని చేస్తా: వినోద్‌కుమార్

ఈ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే వచ్చే ఐదేండ్లు తెలంగాణ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసమే పని చేస్తానని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ సూచించారు. బీఆర్ఎస్ ఏది చెప్పిందో? అది చేసి చూపించిందని అన్నారు. రైతులకు 24 గంటలు కరెంటు, సాగునీరు అందిస్తామని చెప్పి.. అమలు చేసి చూపించినట్టు తెలిపారు. తనను మళ్లీ గెలిస్తే తప్పకుండా నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఎవరి వ్యూహం వారిదే

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ ఇప్పటికే.. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ నుంచి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునితా మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి తలపడనున్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కాంగ్రెస్ నాయకులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నేతలతో ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, తదితరులు పార్టీలో చేరగా.. ఇతర పార్టీల్లోని కీలక నేతలను చేర్చుకోవడం ద్వారా ప్రత్యర్థి పార్టీని బలహీనపర్చే పని మొదలు పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన నేతలను తిరిగి రప్పించే ప్రయత్నాలూ మొదలు పెట్టారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో సైతం చేరికలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులతో బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

### ప్రణాళికలు.. ఎత్తుగడలు..

బీసీ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ సీఎం కేసీఆర్‌పైనే యుద్ధం చేసి వచ్చిన ఈటల రాజేందర్‌ను పార్టీలో చేర్చుకుని టికెట్ కేటాయించిన బీజేపీ.. ఈసారి మల్కాజిగిరి సీటును కైవసం చేసుకోవడానికి అవసరమైన వ్యూహాన్ని రచిస్తోంది. అభ్యర్థి క్షేత్రస్థాయిలో పర్యటించి జనం మధ్యే ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్య నేతలను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇదే దారిలో మరికొందరు వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

### భేటీలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్..

రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో పార్టీ కార్యకర్తలు కొంత నిరుత్సాహానికి గురైనా.. లోక్‌సభ ఎన్నికలకు వారిని సన్నద్ధం చేసేందుకు నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ మేమున్నామంటూ రాష్ట్ర నాయకత్వం భరోసానిస్తోంది. కాన్ఫరెన్సులు, సమీక్షల ద్వారా అలర్ట్ చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు నిర్వహించారు. మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం సెగ్మెంట్ పరిధిలో పర్యటిస్తూ క్యాడర్, కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

### గెలుపే లక్ష్యంగా..

గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. లోకసభ స్థానం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్య నేతలతో సమావేశమవుతూ సమన్వయం చేసే పనిలో పడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించాలని కాంగ్రెస్ క్యాడర్‌కు పిలుపునిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ నేతలు.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోడీ అందిస్తున్న సుస్థిర పాలన గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సభలు, సమావేశాలు ఏర్పాట్లకు సిద్ధమవుతోంది. ఇలా ప్రధాన పార్టీల వ్యూహాలతో 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

### ఇన్‌చార్జిల నియామకం

మల్కాజిగిరి పార్లమెంట్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టిన ప్రధాన పార్టీలు ఇన్‌చార్జీలను నియమించాయి. బీజేపీ ఇన్‌చార్జీని నియమించకపోయినా.. ఈటల రాజేందర్ అన్ని నియోజకవర్గాల్లోని, అందరు నాయకులను కలుస్తూ ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. ఇక కాంగ్రెస్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఇన్‌చార్జి మంత్రిగా నియమించగా.. ఇటీవల మైనంపల్లి హనుమంతరావుకు సైతం అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇక బీఆర్ఎస్ ఇటీవల మల్కాజిగిరి సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో కో–ఆర్డినేటర్‌ను నియమించింది. మేడ్చల్‌కు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మల్కాజిగిరికి మాజీ జెడ్పీ చైర్మెన్ నందికంటి శ్రీధర్, కుత్బుల్లాపూర్‌కు బీఆర్ఎస్ సీనియర్ నేత గొట్టిముక్కల వెంగళరావు, కూకట్‌పల్లికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్‌కు పార్టీ రాష్ట్ర సెక్రెటరీ జహంగీర్ పాష, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మాజీ చైర్మెన్, రావుల శ్రీధర్‌రెడ్డి, ఎల్బీనగర్‌కు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తాను నియమించింది.

# రెండు పూట్ల స్కూల్స్ నడురపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

-అధిక రేట్లలో పుస్తకాల అమ్మకాలు
-విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక భారం మోపుతున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యం
-డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒంటిపూట స్కూల్ నడపకుండా రెండు పూట స్కూలు నడుపుతున్న స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, అధిక రేట్లకు పుస్తకాలు విక్రయిస్తూ తల్లిదండ్రులపై అధిక భారం వేస్తున్న యాజమాన్యాలపై కూడా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో మంచినీళ్లు, మజ్జిక, మరియు ఫస్ట్ ఎయిడ్ బాక్షులు అందుబాటులో ఉంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం 3 టౌన్ ప్రజా సంఘాల ఆఫీసులో మద్దాల ప్రభాకర్ అధ్యక్షుడు జరిగిన డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఈ ఎండాకాలంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఒక్క పూట స్కూల్ నడపకుండా రెండవ పూట కూడా స్కూల్ నడుపుతూ విద్యార్థుల ఆరోగ్యాలతో చలగాటమాడుతున్న ప్రవేట్ కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన సందర్భంగా అధికారంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోపక్క అక్కడ మీకు పూర్తికాకముందే సిలబస్ పూర్తయింది అన్న పేరుతోనే తర్వాత తరగతులకు పిల్లలు తీసుకెళ్తాం అని చెబుతూ వెంటనే బుక్స్ కొనాలి అని చెప్పేసి అధిక రేట్లు పెట్టి స్కూల్స్ లో బుక్స్ విక్రయిస్తున్నారని, దీనివలన విద్యార్థులు తల్లిదండ్రులు పుస్తకాలు కొనలేక ఇబ్బంది పడుతున్నారని, బైక్ మార్కెట్ రేట్ కంటే డబల్ త్రిబుల్ రైడ్లతో పుస్తకాల విక్రయిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులు మోసం చేస్తున్నారని ఆయన సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాలయాలను అంగడి దుకాణాలుగా మారుస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన సందర్భంగా అధికారులను డిమాండ్ చేశారు. ఈ వేసవికాలంలో కనీసం మౌలిక అవసరాలు ఏర్పాటు చేయకుండా స్కూల్ నడుపుతున్నారని, ప్రభుత్వ పాఠశాలలో మంచినీళ్లు విద్యార్థులకు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లో అందుబాటులో ఉంచి చికిత్స చేయించే విధంగా ఉండాలని ఆయన సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవేట్ కార్పొరేటర్ సెమీ కార్పొరేట్ స్కూల్స్ లో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థులకు పాఠశాల నిర్వహిస్తున్నారని , ఇది కచ్చితంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే పద్ధతేరు అని సందర్భంగా హెచ్చరించారు. ఎండాకాలంలో ఏదైనా జరగకూడని సంఘటనలు జరిగితే విద్యార్థులు, తల్లిదండ్రులు, అందరూ బాధపడాల్సి వస్తుందని, అప్పుడు అధికారులు ప్రభుత్వాలు హడావుడి చేయడం కాదని అందుకే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన పేర్కొన్న విషయాల పట్ల అధికారులు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఇతర విద్యార్థి సంఘాలు కలుపుకొని సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చింతల రమేష్, శీలం వీరబాబు, కూరపాటి శ్రీను, కొంగర నవీన్, దిండు మంగపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుక్కుల సుధాకర్, రావులపాటి నాగరాజు, ఎర్ర నగేష్, షేక్ నాగుల్ పాషా, గడ్డం విజయ్, రాజేష్, యశ్వంత్, సాయి, నాగరాజు, రమణ, రహిమాన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# తాహసిల్దార్ సార్..! అక్రమ ఇసుక రవాణా పై చర్యలు ఏవి.?

-ముజాహిద్ పురం, కాకరవాయి పరిధిలోగల పాలేరు వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా..!
-చట్టంలోని లొసుగులకే ప్రాధాన్యత ఇస్తూ అక్రమ ఇసుక రవాణాకు రెవిన్యూ తెర
-ఎన్ని వార్తలు వచ్చిన! చర్యలు శూన్యం
-లంచాలకు అలవాటు పడి,నీటి ఎద్దడికి ప్రత్యక్ష కారకులు సంబంధిత అధికారులే



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం :**

రెవెన్యూతెలంగాణ ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కొత్తగా కొలువు తీరిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశించింది. కానీ తిరుమలాయపాలెం మండలం రెవిన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారనే విమర్శలకు తావిస్తోంది. ఓవైపు ఎలక్షన్ కోడ్ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. రేయింబవళ్లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. అందుకు ప్రధాన కారణం రెవెన్యూ, పోలీస్,మైనింగ్ అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లకు తూతూ మంత్రంగా చలాన వేసి వదిలేయడం,రెవిన్యూ, పోలీస్, మైనింగ్ శాఖలు చట్టంలోని లొసుగులకే ప్రాధాన్యత ఇస్తూ,అక్రమ ఇసుక మాఫియా కు తెర వెనుక నుండి ప్రాధాన్యత ఇస్తున్నారని సర్వత్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని నిత్యం పత్రికల్లో పత్రికల్లో వార్తలు వచ్చిన,చర్యలు తీసుకోకుండా కలెక్టర్ తో సహా సంబంధిత అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామపంచాయతీ ముందు గ్రామ సహాయ కార్యదర్శిలను ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయా... అక్రమ రవాణా ఆగిపోతుందా..? గాయం ఒకచోట ఉంటే వైద్య మరొక చోట చేస్తే సమస్య పరిష్కారం అవుతుందా..! కేవలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కాదు..! సహకారంతోనే జరుగుతోందని బహిరంగనే ప్రజలు చెప్పుకుంటున్నారు.

# కరపత్రాలను ఆవిష్కరించిన విద్యార్థులు

-రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ళ సత్యనారాయణ



**తరంగాలు //కల్లూరు //**అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కల్లూరు బీసీ బాలుర వసతి గృహంలో మహనీయుల జయంతి కరపత్రాలను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమళ్ల సత్యనారాయణ విద్యార్థులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాజిక విప్లవకారుడు మహత్మజ్యోతిబాపూలేకు భారతరత్న ప్రకటించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎంతోమందికి ఉచిత విద్య, మహిళలకు విద్య కల్పించిన మహానుభావుడు మహాత్మ జ్యోతిబాపూలే కు భారతరత్న ప్రకటించకపోవడం చాలా దురదృష్టకరమని కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని మహాత్మ జ్యోతిబాపూలే కు భారతరత్న ప్రకటించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతరం విద్యార్థుల కోసం వారి డైట్ ఫీజుల కోసం, మేస్ చార్జీల కోసం పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ టిఎస్-ఎస్సి అని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం లాగా కాకుండా కొత్త ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిరుద్యోగుల పట్ల వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

# వసతులు లేని మయూరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

-ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ బి మాలతి



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**

ఆదివారం ఖమ్మం పట్టణం లో గల మయూరి మల్టీ స్పెషలిటి ఆసుపత్రి ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి మాలతి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి సైదులు తమ సిబ్బంది తో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆలోపతిక చట్ట నిబంధనలు పాటించకుండా, ఆపరేషన్ థియేటర్ లో ఉపయోగించిన వాయిల్స్, లోడెడ్ సిరంజెస్ ఉంచటం, అన్ని స్పెషలటీస్ కు వక్కటే ఆపరేషన్ తీయేటర్ ఉండటం, వెయిటింగ్ రూమ్ లేకపోవటం, స్త్రీ, పురుషులకు విడిగా టాయిలెట్ సౌకర్యం లేకపోవటం స్టీరిలైషన్ బయట ఉండటం, వ్యాధులు శోకకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం, అవుట్ పేషెంట్ రిజిస్టర్ సరిగ్గా వ్రాయకపోవట, ఎం టీ పి పర్మిషన్ లేకపోయినా అబార్షన్లు జరుగుతుందడం, ఈ ఎస్ ఐ పర్మిషన్ సర్టిఫికెట్, స్పెషలిటీ సర్వీస్ ల బోర్డు డిస్ప్లే ఉంచకపోవడం లాంటి ని గుర్తించి ఆసుపత్రి నిబంధనలకు విరుద్దంగా నడుపుతున్నట్లు గుర్తించారు. ఆపరేషన్ థియేటర్ ను సీస్ చేసి, పై విషయం లకు వివరణ ఇవ్వమని షో కాజ్ నోటీసు జారీ చేశారు. అల్లోపతి క్ చట్టం నిబంధన లు పాటించక ఆసుపత్రి ని నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని తెలిపారు ఈ కార్యక్రమం లో డిప్యూటీ డెమో సాంబశివ రెడ్డి, ఉపేందర్, నజీర్ లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బలంగా ఉంది,కేసులకు భయపడొద్దు

-మేం కొండంత అండగా ఉంటాం
-కార్యకర్తలకు ఎంపీ రవిచంద్ర భరోసా



**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం : జూలూరుపాడు:**

బీఆర్ఎస్ అభ్యర్థి నామను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకుందామని ఎంపీ రవిచంద్ర అన్నారు.రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు తదితర ప్రముఖులతో కలిసి పార్టీ మీటింగుకు ముఖ్య అతిథిగా హాజరు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ బలమైన రాజకీయ పార్టీ అని, అధైర్యపడవద్దని తాము కొండంత అండగా ఉంటామని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు కార్యకర్తలకు భరోసానిచ్చారు.అధికార పార్టీ నాయకులు పెట్టే కేసులకు భయపడవద్దని, తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదామన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో ఆదివారం జరిగిన ముఖ్య నాయకులు,కార్యకర్తల సమావేశానికి ఎంపీ రవిచంద్ర లోకసభలో బీఆర్ఎస్ పక్ష నేత నామ నాగేశ్వరరావు, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,మనమందరం కూడా మళ్లీ మళ్లీ కలుసుకుందామని,మరింత కష్టపడి పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావును గతంలో కన్నా కూడా అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకుందామన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రముఖులు పూలదాసు కృష్ణమూర్తి,బానోతు నీల్లా,భూక్యా కళావతి,ఎలంకి సత్యనారాయణ,లకావత్ గిరిబాబు,చావా వెంకట రామారావు తదితరులు హాజరై ప్రసంగించారు.

# మిర్యాలగూడ లో నగదు పట్టివేత టూటౌన్ సిఐ నాగార్జున ఆధ్వర్యంలో



**తరంగాలు/మిర్యాలగూడ ప్రతినిధి**

నందిపహాడ్ క్రాస్ రోడ్ వద్ద మిర్యాలగూడ టూ టౌన్ సీఐ గారు మరియు సిబ్బంది లు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి 1,60,000/- నగదు ను రవాణా చేస్తు పట్టుబడినాడు, ఆధారాలు అడుగగా ఎటువంటి ఆధారాలు చూపందున అట్టి నగదును సీజ్ చేసి జిల్లా ట్రెజరీ ఆఫీస్ కి పంపనైనది.

# ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** వరంగల్ బస్టాండ్ దగ్గర వరంగల్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు వేల్పుకొండ రవి. నగర అధ్యక్షులు ఎండి గౌస్ ఆధ్వర్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు ఆదివారం జరిగాయి. అన్నదాన దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరాటే ప్రభాకర్. చిరంజీవి జిల్లా అధ్యక్షుడు బేడేదే వీరన్న. సాయిధరమ్ తేజ్ జిల్లా అధ్యక్షుడు ఆడుప మహేష్ విచ్చేసి సుమారు 400 మందికి అన్నదానం చేశారు. రైల్వే స్టేషన్ బస్ స్టాండ్ సమీపంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. అన్ని రంగాల్లో యువత చెడు మార్గంలో వెళ్లకుండా ప్రజలకు సేవ కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఎండి హుస్సేన్. నాగరాజు. వంశీ. మరియు అభిమానులు చాలా మంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లోకి ఎలా మారతారు

- రాజీనామా చేసి పార్టీ మారాలి
- తెల్లంపై అనర్హత వేటు వేయాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా




**పినపాక/తరంగాలు** భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు హాజరుకావడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం అని తెల్లం వెంకటరావు పై అనర్హత వేటు వేయాలని స్పీకర్ కి ఫిర్యాదు చేస్తున్నాం అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకు వెళతాం అని కోర్టులోనే తేల్చుకుంటాం అన్నారు.బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లో చేరడం పార్టీ వ్యతిరేక వ్యతిరేక చర్యలు క్రిందకే వస్తుందన్నారు. తెల్ల వెంకట్రావు రాజీనామా చేసి పార్టీ మారాలి లేదంటే స్పీకర్ అనర్హత వేటు వేయాలన్నారు. ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని అని పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని ఇప్పుడు దేనితో కొట్టాలన్నారు.

# ఘనంగా ఇఫ్తార్ విందు



**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** ఆదివారం రోజు పర్వతగిరి మండలంలో ఘనంగా ఇఫ్తార్ విందు పర్వతగిరి మైనార్టీ సోదరులు మరియు కల్లెడ గ్రామం సోమారం గ్రామం మూడు గ్రామాలకు కలిపి పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందు ఇచ్చిన అజీమ్ కరీం చికెన్ సెంటర్ పర్వతగిరి విందులో పాల్గొన్నవారు పర్వతగిరి మసీద్ గురు పెద్ద ముజామిల్ మలిసాబ్ మస్తాన్ మాజీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండి గౌస్ పాషా మున్న ముక్తియాత్ యాకూబ్ పాషా ఫక్రుద్దీన్ మరియు కల్లెడ గ్రామం మజీద్ ముల్లసాబ్ సర్వర్ మియా అఫ్జల్ మియా తురుకల సోమారం మాజీ ఎంపీటీసీ మొహమ్మద్ అలీ మాజీ వార్డ్ నెంబర్ యాకూబ్ పాషా అక్బర్ షఫీ మూడు గ్రామాల కుల పెద్ద మనుషులు విందులో పాల్గొన్నారు మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కరీమాబాద్ యువజన సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక





**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** ఆదివారం రోజు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కరీమాబాద్ శాఖ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కరీమాబాద్ అంబేద్కర్ భవన్ వద్ద మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి అంబేద్కర్ యువజన సంఘం సమావేశం ఏర్పాటు చేశారు ముందుగా జయంతి కార్యక్రమాలను ఏర్పాటు విషయమై చర్చించి తగనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల అంబేద్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షులుగా జక్కుల రాజు ప్రధాన కార్యదర్శిగా తరాల రవితేజ కోశాధికారిగా బొమ్మల రాంప్రసాద్ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఇట్టి సమావేశంలో భవన కమిటీ అధ్యక్షులు నీల మల్లేశం వార్డు పెద్దమనిషి కదారి కుమార్ మహిళా నాయకురాలు తరలి రాజమణి భక్తుల రమేష్ బాబు గాలి రాజు ఎలుక సిద్ధార్థ మగ్గిడి సుధాకర్ నీలం కిరణ్ నీలం రాజు ఒంటెల సురేష్ ఒగ్గుల నరేష్ ఎరుకల సాయి గాలి నవీన్ వినోద్ చింటూ తదితరులు పాల్గొని రాబోయే జయంతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకుంది సహకరించాలని సంఘం తీర్మానం చేసింది.

# రేగా మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయి

- కర్మఫలం రేగాను వెంటాడింది
- తుక్కుగూడలో జరిగిన జన జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- కాంగ్రెస్ పినపాక మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం



**పినపాక/తరంగాలు** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అయిందని, పొంగులేటి శబదం నేడు నిజమయిందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అన్నారు. ఆదివారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తుక్కుగూడ జన జాతర సభను విజయవంతం చేసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు, శ్రేణులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శబదం చేసిన విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కరంటే ఒక్కరిని అసెంబ్లీ గేటు తాకానివ్వను అనే మాటను సంపూర్ణం చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఒక్కగాని ఒక్క భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వెయ్యాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, రేగా కాంతారావు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఉందని ఎద్దేవా చేశారు. ఆనాడు మీరు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్ళినప్పుడు మీకు ఏ పార్టీ అనర్హత వేటు వేశారని అసలు మీరు మీపై అనర్హత వేటు వేసుకునే దుస్థితికి తీసుకొచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానన్నారు. కర్మఫలం ఎప్పటికీ తిరిగి వెంటాడుతుందని ఆనాడు మీరు చేసిన కర్మఫలం నేడు పినపాక ప్రజలు మీకు ఆ కర్మ ఫలితాన్ని రుచి చూపించారని, ఇకనైనా మీ పద్ధతి మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జన జాతర సభ ఇంతలా విజయవంతం అయినందుకు ఓర్వలేక ఇలా మాట్లాడడం తగదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పై ,మంత్రులపై, ఎమ్మెల్యేలపై నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఇక్కడ ఊరుకోవడానికి ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు గాని కార్యకర్తలు గాని సిద్ధంగాలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉడుముల లక్ష్మీ రెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణంరాజు, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# తెల్లం వెంకట్రావు పై అనర్హత వేటు వేయాలి

-పార్టీ ఫిరాయింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి
-బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎన్ ఎన్ రాజు



**పినపాక/తరంగాలు** భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు హాజరుకావడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామనీ, తెల్లం వెంకటరావు పై అనర్హత వేటు వేయాలని స్పీకర్ కి ఫిర్యాదు చేస్తున్నామని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎన్ రాజు తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకు వెళతామని. కోర్టులోనే తేల్చుకుంటామన్నారు. బీఆర్ఎస్ లో గెలిచి కాంగ్రెస్ లో చేరడం,పార్టీ వ్యతిరేక చర్యలు గా పరిగణలోకి తీసుకోవలసి వస్తుందన్నారు. తెల్ల వెంకట్రావు తన ఎమ్మెల్యే పదవికి,పార్టీకి రాజీనామా చేసి పార్టీ మారాలి అన్నారు. లేదంటే స్పీకర్ అనర్హత వేటు వేయాలన్నారు. ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యే లను రాళ్లతో కొట్టండని అని పిలుపునిచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని ఇప్పుడు దేనితో కొట్టాలి అని బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎన్ రాజు ప్రశ్నించారు.

# క్యాన్సర్ తో బాధపడుతున్న అబ్దుల్ మోయిన్

-ఆర్థిక సహాయం కొరకు ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు



**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** వరంగల్ కాశీబుగ్గ పోచమ్మ మైదాన్ ప్రాంతంలోని 21వ డివిజన్ ఎల్బీనగర్ నగర్ లో మోమిన్ పుర కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అబ్దుల్ మోయిన్, వృత్తి, ఆటో పార్ట్స్ లో(జాబ్) వర్కర్ గా పని చేసేవాడు దురదృష్టవశాత్తు ఇతను క్యాన్సర్ బారిన పడ్డాడు ఇప్పుడు లాస్ట్ స్టేజ్ లో ఉన్నాడు, ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం కిరాయి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇతను ఆర్థికంగా చాలా కష్టాల్లో ఉన్నాడు ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉంది దయచేసి మీకు తోచినంత మానవ దృక్పథంతో సహాయం చేయగలరు. సహాయం చేయాలనుకునేవారు ఈ నెంబర్ కి ఫోన్ పే చేయగలరని.రెండు చేతులెత్తి వేడుకున్నారు. నోట్:50,100 . మీ స్తోమతను బట్టి ఎంతైనా చేయగలరు. ఫోన్ పే నెంబర్: 89786 97197 అబ్దుల్ మొయిన్.

# 1682 కుటుంబాలకే వంద రోజుల పని..

- లక్ష్యం చేరని ఉపాధి పనులు..
- కూలీలకు 100 రోజుల పని కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం..
- జాబ్ కార్డులను సద్వినియోగం చేసుకోలేక పోతున్న కూలీలు..
- 64.89 లక్షల పనిదినాలకు 55 లక్షల పనిదినాలు పూర్తి..

**తరంగాలు-సూర్యాపేట కలెక్టరేట్**
ఉపాధి హామీలు భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించవలసి ఉండగా కేవలం 1682 కుటుంబాలకే వంద రోజుల పని కల్పించి లక్ష్యం లక్ష్యానికి దూరంగా మారారు. గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించి,వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం జిల్లాలో మందకొండిగా సాగుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చుతున్నది. యాసంగి వరి నాట్ల అనంతరం పల్లెల్లో వ్యవసాయ పనులు అంతగా లేనప్పుడు కూలీలు ఉపాధి హామీ పనుల వైపు చూస్తారు. కాని ఈ ఏడాది అధికారులు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేక పోయారు. ఈ ఆర్దిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 64.89 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 55 లక్షల పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే 13వ స్థానంలో కొనసాగుతున్నారు.ఈ ఏడాది లో 1,83,547 కుటుంబాలకు అధికార యంత్రాంగం పని కల్పించింది. ఇందులో 1682 కుటుంబాలకే వందరోజుల పని కల్పించారు.



**ఉపాధి లక్ష్యం 64.89 లక్షల పనిదినాలు..**
సూర్యాపేట జిల్లాలో ఉపాధి హామీ పనులు లక్ష్యం చేరేలా లేదు. జిల్లా పరిధిలో 475 గ్రామ పంచాయతీల వారీగా పనులను గుర్తించిన యంత్రాంగం 64.89 లక్షల పని దినాలు కూలీలకు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాని ఆర్థిక సంవత్సరం పూర్తయ్య నాటికి 55 లక్షల పని దినాలు మాత్రమే కల్పించారు.84.75 శాతం లక్ష్యం చేరుకున్నారు.

**3,46,086 కూలీలకు మాత్రమే పని..**
జిల్లాలోని 23 మండలాల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు 2,61,192 ఉండగా, 5,69,350 మంది కూలీలు ఉన్నారు. 2023%--%24 సీజన్‌లో 1,83,547 కుటుంబాల్లో 3,46,086 మంది కూలీలు పని కల్పించారు. ఈ ఆర్దిక సంవత్సరంలో 159.17 కోట్ల రూపాయిలు ఉపాధి హామీలో ఖర్చు చేయగా 96.45 కోట్ల రూపాయలు కూలీలకు వేతనంగా చెల్లించారు.జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో కేవ

# మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

-మల్లేపల్లి ఓసీ దుమ్ముతో వ్యవసాయం కుదేలు
-వరి, మిర్చి పంటలకు నష్టపరిహారం అందించాలి
-సింగరేణి అధికారులను డిమాండ్ చేసిన సామాజిక కార్యకర్త కర్నె రవి





**పినపాక/తరంగాలు**
మల్లెపల్లి ఓపెన్ కాస్ట్ దుమ్ముధూళి వల్ల నష్టపోతున్న వ్యవసాయ పంటలకు నష్టపరిహారం అందించాలని మణుగూరు అడ్వకేట్ సామాజిక కార్యకర్త కర్నె రవి, సింగరేణి అధికారులను కోరారు. ఆదివారం పద్మ గూడెం తిర్లాపురం పరిధిలోని మల్లెపల్లి ఓసి ప్రభావిత వ్యవసాయ పంటలను కర్నె రవి పరిశీలించారు. మిర్చి పొలాల్లో పనిచేస్తున్న కూలీలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. మల్లెపల్లి ఓసి వల్ల వచ్చే దుమ్ము ధూళితో తమ పంటలు సర్వనాశనం అవుతున్నాయని, పంటలు దిగుబడి రాక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. తక్షణమే సింగరేణి అధికారులు స్పందించి రైతులకు సరైన నష్ట పరిహారం అందించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు.

# కూసుమంచిలో ఉత్సాహంగా తాండ్ర వినోద్ రావు పర్యటన

**తరంగాలు/ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం**
భారతీయ జనతా పార్టీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోద్ రావు పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. రూరల్ మండలంలో పలు గ్రామాలతో పాటు తిరుమలాయ పాలెం, కూసుమంచి లలో అనేక మంది రైతులను కలిసి వారి సాధకబాధకాలను విన్నారు. వ్యవసాయంలో తాము నష్టపోతున్న విధానాన్ని రైతులు వివరించారు. అప్పటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కంటి తుడుపు చర్యలతో రైతులను అశ్రద్ధ చేశాయని వినోద్ రావు అన్నారు. కేంద్రంలో ముచ్చటగా మూడో సారి మోడీ ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వానికి ఖమ్మం అండగా ఉండాలని, ఈ ఎన్నికల్లో ప్రజలు కమలం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.ఈ గడ్డ రైతు బిడ్డగా తనకు వ్యవసాయం మీద సమగ్ర అవగాహన ఉన్నదనీ, తనను పార్లమెంటుకు పంపితే రైతు సమస్యలను పార్లమెంటులో ప్రస్తావనకు తీసుకొస్తానని చెప్పారు. కూసుమంచిలో వినోద్ రావు ఆగి తే నీరు సేవిస్తూ చిరు వ్యాపారులతో ముచ్చటించారు. మోడీ ప్రభుత్వం ఇస్తున్న



10,000 రూపాయలు, ముద్ర యోజన వంటి పథకాలు వారికి అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక వ్యవస్థలో కీలమైన చిరు వ్యాపారులను రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా, మోడీ పురోగతికి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని చెప్పారు. ఈ సమయంలో కాళ్ళ లేని ఒక దివ్యాంగుడు వినోద్ రావు ని ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. “మీ సేవా కార్యక్రమాలు తెలుసుకొని ఆనందించాను. మీ లాంటి వాళ్ళు తప్పకుండా గెలవాలి. మాలాంటి మద్దతు మీకే,” అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ మండల అధ్యక్షులు మల్లారెడ్డి జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు.

# పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్య యత్నం




**తరంగాలు- అచ్చంపేట**
పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం చేసుకున్న సంఘటన అచ్చంపేట మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు స్థానికులు తెలిపిన వివరణ ప్రకారం బల్మూరు మండలం గోదల గ్రామానికి చెందిన సుభాష్ కు అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయితో రెండేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో భార్య సంసారానికి రావడం లేదు. ప్రస్తుతం రంగాపూర్ లోనే ఉంటుంది. సుభాష్ ఆదివారం రంగాపూర్ కు వచ్చాడు. ఆ సమయంలో ఇంటిదగ్గర భార్య కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేరు. ముందస్తు ప్రణాళికలో భాగంగా వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన అతన్ని 108 లో అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆత్మహత్యయత్నానికి పూర్తి కారణాలు తెలియవలసి ఉంది.

# ట్రేడర్ లైసెన్స్ ముసుగులో జీరో దందా...!

-నిద్ర మత్తులో మార్కెట్ అధికారులు
-రాత్రి వేళల్లో జోరుగా మక్కలు కొనుగోల్లు..

**తరంగాలు/కేసముద్రం/**
కేసముద్ర వ్యవసాయ మార్కెట్ అంటే ఆసియా ఖండంలోని గుర్తింపు తెచ్చుకున్న వ్యవసాయ మార్కెట్ గా పేరుగాంచింది. అంతటి పేరు ప్రఖ్యాతలుగాంచిన కేసముద్ర వ్యవసాయ మార్కెట్ నేడు జీరో దందాలకు నిలువుగా మారుతుందని స్థానికులు నివ్వరపోతున్నారు. ఎందుకు అధికారం నిర్లక్ష్యమే అని ముమ్మాటికి గంటపదంగా చెప్పకనే చెబుతున్నారు. కేసముద్రం మండల పరిధిలోని చుట్టుపక్కల మండలాల రైతులు పండించిన ప్రతి వ్యవసాయ ఉత్పత్తులను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కు తరలించే విక్రయించుకుంటారు ప్రతి సీజన్ కు మార్కెట్ కు గణనీయంగా సరుకులు రావటం వలన కేసముద్ర వ్యవసాయ మార్కెట్ కు గణనీయంగా ఆదాయం పెరిగేది కానీ కొంతమంది వ్యాపారులు ట్రేడర్ లైసెన్స్ ముసుగులో ప్రతి సీజన్లో జీరో దందాలు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కానీ మార్కెట్ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడకపోవడం అలాంటి వారి పైన చర్యలు తీసుకోకపోవడం వెనక మతాలాబ్... ఏమిటో నని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. అధికారులు చూసి చూడనట్టు వదిలేయడం వల్ల అమాయక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పండించిన పంటకు సరైన ధర లభించదని పైగా తూకాలలో మోసాలు జరిగే అవకాశం ఉన్నదని పలువురు అభిప్రాయం తెలియపరుస్తున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న రైతులకు దిగుబడి గణనీయంగా



పెరిగిందని అంచనాలు వేస్తున్నారు. మార్కెట్కు కూడా మొక్కజొన్న విక్రయాలకు రికార్డ్ అనుగుణంగా తరలి వస్తుందని, ఇదే అదునుగా భావించిన కొంతమంది మార్కెట్ సెలవు దినాలలో ట్రేడర్ లైసెన్స్ ఉన్నంత మాత్రాన ఇలా రాత్రివేళల్లో కొనుగోలు జరపడం వ్యవసాయ మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం తీరు కనబడుతుందని పలువురు రైతులు రైతు సంఘాల నాయకులు అధికారుల తీరును విమర్శిస్తున్నారు.



ఇంకా అభివృద్ధి చెందాల్సిన మార్కెట్ తీవ్రంగా నష్టపోతుందని మార్కెట్ ఆదాయానికి గండి పడితే అభివృద్ధి ఎలా జరుగుతుందని పలువురు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని ఇలాంటి వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్టు వేసి ఇలాంటి వ్యాపారుల లైసెన్సులు రద్దుచేసి బ్లాక్లిస్టులో పెట్టాలని అలాంటప్పుడే ఇలాంటి జీవ దందాలకు అడ్డుకట్టు వేయచ్చని లేని ఎడల కేసముద్రం వేసే మార్కెట్ కు తీవ్రంగా నష్టం జరుగుతుందని పలువురు అభిప్రాయం చెబుతున్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి క్యామా మల్లేష్



**అచ్చంపేట - భువనగిరి**
రంజాన్ పండుగ పురస్కరించుకొని ముస్లిం సోదరులకు బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరిలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమానత్వం లౌకికవాదంతో ముందుకు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# కాంగ్రెసు బీఆర్ఎస్, బీజేపీ లను ఓడించండి

## – సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ గెలిపించండి



**తరంగాలు–యాదగిరిగుట్ట రూరల్**
కాంగ్రెసు బీఆర్ఎస్ బీజేపీలను ఓడించి, సీపీఐ(ఎం) ను గెలిపించాలి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నరసింహులు అన్నారు. యాదగిరిగుట్ట మండలం మైలారిగూడెం ఆదివారం, భువనగిరి పార్లమెంటు సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారాలు మోపుతూ దేశ సమైక్యత, సమగ్రతను దెబ్బతీస్తు, భారత రాజ్యాగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఎం డి జాంగిర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగ నరసింహులు కోరారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్ శక్తులకు అప్పచెప్పుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అవినీతిని చట్టబద్ధత చేసిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల కంటే ప్రజల సమస్యలు తెలిసిన ప్రజా ఉద్యమ నాయకుడు ఎండి జాంగిర్ ను గెలిపించాలని కోరారు. బోనగిరి పార్లమెంటు నియోజకవర్గం పై సమగ్ర అవగాహనతో ఉన్న సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బబ్బురి పోశెట్టి, పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి, నాయకులు నల్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డికి ఉగాది పురస్కారం..




**తరంగాలు–చండూరు**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చండూరులో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం రెడ్డిగర్జన సామాజిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని బషీర్ బాగ్ లోని ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి తో పాటు రచనా రంగంలో చేస్తున్న కృషి గాను ఈ ఉగాది పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంకెనపల్లి సుధీర్ రెడ్డి, నావల్ల సత్యనారాయణ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే రంగారెడ్డి, సంతోష్ రెడ్డి, సుమతి, శ్రీలక్ష్మి, వసంత రెడ్డి, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, గర్జన పత్రిక ఎడిటర్ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర



**తరంగాలు– రంగారెడ్డి ప్రతినిధి**
వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకు న్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కేంద్ర ప్రభు త్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని వ్యకాస జిల్లా నాయకులు కాకి రమేష్ విమర్శిం చారు. ప్రభుత్వ నియంత వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. వ్యకాస సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని ఇబ్రహీంపట్నం మండలంలోని దండుమైలారం గ్రామంలో నమోదు కార్యక్రమాన్ని విస్తృతం గా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజ ల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. తాగు నీటి సమస్య జఠిలంగా మారిందని ప్రజలు, మహిళలు నాయకుల దృష్టికి తీసుకువస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీని ని ర్వీర్యం చేసేందుకు అనేక కుట్రలు పన్నుతున్నదని అన్నారు. ఇప్పటికే గత బడ్జెట్‌లో నిధుల కేటా యింపులు తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు జియో టాకింగ్, వ్యవసాయ కూలీల ఫోటో క్యాప్చర్ పేరుతో మరింత ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పారు. కనీస వేతనం రూ. 600కు పెంచి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. అయినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వెలిబుచ్చారు. మరోవైపు గ్రామాల్లో కరువు విలయతాం డవం చేస్తుందని చెప్పారు. తాగునీటి సమస్య జఠిలంగా మారిందన్నారు.

# రైతుల పట్ల కెసిఆర్ మొసలి కన్నీరు

**తరంగాలు/కేసముద్రం/**
గత పది ఏళ్ల చంద్రశేఖర రావు ప్రభుత్వ హయాంలో రైతులకు వందల హామీలు ఇచ్చి నెరవేర్చక పోవడమే కాకుండా ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటు అని అన్నారు ప్రస్తుతం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ నాటకము ఈ యాత్ర, చేపట్టాడని వారు ఎద్దేవా చేశారు వారికి చిత్తశుద్ధి ఉంటే గత పది ఏళ్లలో రైతులకు ఇచ్చిన హామీలల్లో భాగంగా ఒక 1,00,000 లక్ష రూపాయలు కూడా రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయని చంద్రశేఖర రావు ఇప్పుడు రైతుల రుణమాఫీ గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు గత పదేండ్ల ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తామని మోసం చేయడమే కాకుండా వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు ఇచ్చి కూలి చేసుకునే పేదవాడికి ఎలాంటి సహాయం చేయకపోవడం సిగ్గుచేటని వారు మాట్లాడారు గతంలో అతివృష్టి అనావృష్టి వలన అకాల వర్షాలు కురిసి వరద వచ్చి పంట నష్టం జరిగితే ఏ ఒక్క రైతులకు కూడా నష్టపరిహారము ఇవ్వని ఆదుకొని చేతగాని ప్రభుత్వము ఏమైనా ఉందంటే కెసిఆర్ ప్రభుత్వమని వారు విమర్శించారు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నికల ముందు దళితున్ని ముఖ్యమంత్రి చేస్తాను అని చెప్పి చేయకపోవడమే కాకుండా గతంలో వారు ఇచ్చిన హామీలల్లో భాగంగా దళితులకు మూడెకరాల భూమి ఇస్తా దళిత బంధిస్తా బిసి బందు ఇస్తామని గిరిజన బంధు ఇస్తామని చెప్పి ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని చెప్పి నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు



ఇస్తామని చెప్పి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇలా వందల హామీలు ఇచ్చి నెరవేర్చని గత ప్రభుత్వ టిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడము సిగ్గుచేటని వారు మండిపడ్డారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారు ఇచ్చిన ఆరోగ్యలను 100 రోజుల్లో అమలు పరుస్తూ ప్రభుత్వ ఏర్పడి నాలుగు నెలలు గడిచిన సమర్థవంతంగా ప్రజలకు పాలనను అందుబాటులో ఉంచుతూ నిత్యం ప్రజా సేవలో మందుంటున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అహర్నిశలు ఈ రాష్ట్ర ప్రజలకు తమ వంతు సేవలు అందిస్తుండగా అది చూసి జీర్ణించుకోలేని విపక్ష నాయకులు హేళన చేయడం విమర్శించడం సరికాదని వారు మండిపడ్డారు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తూ, దేశంలో రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రిగా చూడడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక లక్షణమని వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాట్రపల్లి గ్రామ ఎంపీటీసీ గుగులోతు సునీత దసురు నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరికొండ మల్లయ్య బూర బిక్షపతి సోలాపురం సంజీవరెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు జల్లే యాకాంబరం ఉపాధ్యక్షులు పుట్టా ప్రభాకర్ మాజీ వార్డు సభ్యులు ఆంగోతు వీరు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దెబ్బేట సూరయ్య కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బాదావత్ నరేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ పుస్తకాల విక్రయాన్ని అరికట్టాలి

**–విద్యార్థులకు న్యాయం చేయాలి**
**–బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కారుకొండ ప్రదీప్**
**–పట్టుబడిన పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్**

**తరంగాలు–శంషాబాద్**
మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజు దోపిడీ పుస్తకాల విక్రయానికి యాజమాన్యాలు తెరలేపాయని బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కారుకొండ ప్రదీప్ అన్నారు. శంషాబాద్ మండలంలో నానాటికి ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడి విచ్చలవిడిగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన శంషాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ శంషా బాద్ మండల పరిధిలో ప్రయివేట్ మధ్యతరగతి కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయని అన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో వార్షిక పరీక్షలు పూర్తి కాక ముందే నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, టై బెల్టు ఇతర వస్తువులను బలవంతంగా విద్యార్థుల తల్లిదండ్రులకు కట్టబెడుతున్నా రని అన్నారు. అడిగితే డొంక తిరుగుడు సమాధానం చెబుతున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశా లలలో పుస్తక విక్ర యం పూర్తిగా నిషేధం ఉందన్నారు. అయినప్పటికీ నిబంధనలు పట్టించుకో కుండా అందిన



విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరి ఉదాసీన వైఖరితో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికే ఈ దోపిడీ ప్రారంభమైన కారణంగా వెంటనే విద్యాశాఖ అధికారులు నిరంతర తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు తనిఖీల్లో పట్టుబడిన

కాడికి దోచుకోవడానికి యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నా యన్నారు. అడిగితే తమ పిల్లలను ఏ విధంగా పాఠశాలలో ఇబ్బందులు పెడ తారోనన్న భయంతో తల్లిదండ్రులు ప్రశ్నించడం లేదన్నారు. ఇప్పటికే పలు ప్రయివేట్ పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు తీసుకుంటున్నా యని అన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో 10 శాతం నుంచి వందశాతం వరకు ఫీజులు పెంచుకుంటూ తల్లిదండ్రుల నుంచి భారీగా డబ్బులు వ సూలు చేస్తున్నారన్నారు. డొనేషన్ల పేరుమీద ఫీజుల దోపిడీ జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము పాఠ శాలల గుర్తింపు రద్దు చేయాలని అన్నారు. వార్షిక విద్య క్యాలెండర్ ప్రకారం పాఠశాల నిర్వహణ జరుగుతున్నదా లేదా అనే అంశాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అధికారులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్ర పర్యటనలో నిజాలను అంచనా వేయాలని అన్నారు. అధికారులు సైతం ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలతో కుమ్మక్కైతే స్థానిక అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఫీజుల దోపిడీపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

# ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలి

**–రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా మోడీ విధానాలు**
**–సీపీఐ(ఎం) భువనగిరి అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి : పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు**

**తరంగాలు–చౌటుప్పల్**
రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించే గొంతు పార్లమెంట్‌లో ఉండాలని, భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ మున్సిపల్ కమిటీ సమావేశం ఎమ్‌డీ పాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేండ్ల మోడీ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించారన్నారు. ధరల మీద ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటూ కార్మిక, రైతాంగ సమస్యలు పట్టించుకోకుండా పాలన సాగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగంపై నల్ల చట్టాలు తీసుకువచ్చి వందలాది మంది రైతుల చావులకు బీజేపీ కారణమైందన్నారు. ప్రతిపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ దాడులు నిర్వహిస్తూ




భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. బీజేపీలో ఉంటే నీతిమంతులు, లేకపోతే అవినీతిపరులా అని ప్రశ్నించారు. దేశంలో మూలుగుతున్న నల్లధనాన్ని తీసుకువచ్చి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమచేస్తానని చెప్పిన మోడీ.. ఒక్క రూపాయి కూడా జమచేయలేదని గుర్తుచేశారు. ప్రజలపై పన్నుల భారం మోపడం, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేసిందన్నారు. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది బీజేపీ కాదా అని ప్రశ్నించారు. మతోన్మాదం పేరుతో దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని తెలిపారు. మతవిద్వేషాలు రెచ్చగొడుతూ హిందుత్వం పేరుతో పబ్బం గడుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసంచేసే విధంగా మోడీ విధానాలు ఉన్నాయన్నారు. భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎమ్‌డీ.జహంగీర్‌ను గెలిపించేందుకు ప్రతికార్యకర్తా సైనికునిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ పార్టీ మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహ, జిల్లాకమిటీ సభ్యులు అవ్వారు రామేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపగోని లక్ష్మణ్, కౌన్సిలర్ దండ హిమబిందు అరుణ్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల ధర్మయ్య, నాయకులు బత్తుల దాసు, ఉష్కాగుల శ్రీనివాస్, గోశిక కర్నాకర్, బొడ్డు రాజుగౌడ్, నెల్లికంటి నర్సింహ, బొమ్మకంటి కృష్ణ, బాతరాజు దశరథ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# విస్తారా ఎయిర్‌లైన్స్‌కు షాక్ ఇచ్చిన డీజీసీఏ..!

టాటా(గ్రూప్ నేతృత్వంలోని ఏవియేషన్ కంపెనీ విస్తారాను గత కొద్దిరోజులుగా సమస్యలు వెంటాడుతున్నాయి. పైలెట్ల రాజీనామాలు.. సామూహిక సెలవులతో వందలాది విమానాలు రద్దయ్యాయి. ఈ క్రమంఓలనే కంపెనీకి తాజాగా డీజీసీఏ షాకిచ్చింది. పైలట్ల శిక్షణకు సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నోటీసు జారీ చేసింది. కంపెనీ పైలట్ శిక్షణ ఉల్లంఘనలకు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో నోటీసులు ఇచ్చింది. పైలట్లకు శిక్షణ ఇచ్చే ప్రక్రియలో జీరో ఫ్లైట్ టైమ్ ట్రైనింగ్ లో భాగంగా పైలట్లు వివిధ రకాల విమానాలను నడపడానికి శిక్షణ పొందుతారు. ఇందులో పైలట్లు అనేక దశల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. అయితే, ఈ ప్రక్రియలపై డీజీసీఏ ప్రశ్నలు లేవనెత్తింది. జీరో ఫ్లైట్ టైమ్ ట్రైనింగ్‌లో భాగంగా విస్తారా పైలట్లు బోయింగ్ 787 విమానాలను నడపాల్సి ఉంది. అయితే, నిబంధనలను ఉల్లంఘించినందుకు నోటీసుల నేపథ్యంలో శిక్షణ తాత్కాలికంగా నిలిచిపోయింది. పైలట్లు అప్పటికే ఎయిర్‌బస్ ఏ320 విమానాలను నడుపుతున్నారు. శిక్షణలో భాగంగా బోయింగ్ 787 విమానాలను నడపాల్సి వచ్చింది. విస్తారా యూరోపియన్ రూట్లలో బోయింగ్ 787 విమానాలను ఉపయోగిస్తున్నది. టాటా గ్రూప్‌కు చెందిన ఏవియేషన్ కంపెనీ ఇప్పటికే ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో డీజీసీఏ నోటీసు ఇచ్చింది. ఈ వారం మొదటి మూడు రోజుల్లో విస్తారా 150కిపైగా విమానాలను రద్దు చేయాల్సి వచ్చింది.




## కార్ల ఎగుమతిపైనే మారుతి నజం 2030 నాటికి ఇదీ టార్గెట్..!




గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో విదేశాలకు కార్లు ఎగుమతి చేసిన మారుతి సుజుకి 2024-25 ఆర్థిక సంవత్సరంలో మూడు లక్షల మార్కును దాటుందని విశ్వాసంతో ఉంది. 2030 నాటికి ఎనిమిది లక్షల కార్ల వరకూ ఎగుమతి చేస్తుందని మారుతి సుజుకి ఇండియా కార్పొరేట్ ఎఫైర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి చెప్పారు.'మూడేండ్ల క్రితం వరకూ విదేశాలకు లక్ష నుంచి 1.2 లక్షల వరకూ కార్లు ఎగుమతి చేశాం. జాతీయ విజన్, వ్యాపార ఆకాంక్షలకు అనుగుణంగా గత పరిస్థితిని అధిగమించాలని నిర్ణయించా. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2.59 లక్షలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2.83 లక్షల కార్లు ఎగుమతి చేశాం' అని రాహుల్ భారతి పీటీఐతో అన్నారు. గతేడాది విదేశాలకు కార్ల ఎగుమతిలో 9.3 శాతం పురోగతి సాధించామన్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి చేసిన కార్లలో 42 శాతం మారుతి సుజుకివేనన్నారు. ప్రస్తుతం తయారు చేస్తున్న పెట్రోల్ లేదా డీజిల్ వేరియంట్ కార్లతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎలక్ట్రిక్ కార్ల తయారీ కూడా ప్రారంభం అవుతుందని రాహుల్ భారతి చెప్పారు. జపాన్, యూరోపియన్ యూనియన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు 'ఈవీ కార్లు' కూడా ఎగుమతి చేస్తామన్నారు. నిత్యం తమ శక్తి సామర్థ్యాలను పెంచుకుంటూ 2030 నాటికి మొత్తం 7.5 లక్షల నుంచి 8 లక్షల కార్లను విదేశాలకు ఎగుమతి చేస్తామన్నారు. 100 దేశాలకూ అన్ని మోడల్ కార్లు ఎగుమతి చేయడం లేదని, ఎగుమతులను పెంచడంతోపాటు పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. మారుతి సుజుకి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2,83,067 కార్లు విదేశాలకు ఎగుమతి చేసింది. 2022-23లో 2,59,333 కార్లు, 2021-22లో 2,38,376 కార్లు ఎగుమతి చేసింది. 2020-21లో కేవలం 96,139, 2019-20లో 1,02,171, 2018-19లో 1,08,749 కార్లు ఎగుమతి చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో సౌత్ ఆఫ్రికా, సౌదీ అరేబియా, మెక్సికో, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, ఐవరీ కోస్ట్ వంటి దేశాలకు ఎగుమతులు చేసింది మారుతి సుజుకి. ఆయా దేశాలకు మారుతి బాలెనో, డిజైర్, స్విఫ్ట్, ఎస్-ప్రెస్సో, గ్రాండ్ విటారా, జిమ్నీ, సెలెరియో, ఎర్టిగా మోడల్ కార్లు ఎక్కువగా ఎగుమతి చేసింది.

# మార్కెట్‌లోకి రెడ్ మీ కొత్త ఫోన్ ధర ఎంతో తెలుసా...?

ప్రస్తుతం మార్కట్లోకి కొత్తకొత్త స్మార్ట్ ఫోన్‌లు వస్తున్నాయి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అధునాతన ఫీచర్లతో కూడిన ఫోన్‌లను విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా కెమెరాకు అధిక ప్రాధాన్యత ఇస్తూ స్మార్ట్ ఫోన్‌లను తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రముఖ స్మార్ట్ ఫోన్ దిగ్గజం రెడ్‌మీ భారత మార్కెట్లోకి కొత్త ఫోన్‌ను లాంచ్ చేస్తోంది. రెడ్‌మీ టర్బో 3 పేరుతో త్వరలోనే ఈ ఫోన్ మార్కెట్లోకి రానుంది. ఈ ఫోన్‌లో ఎలాంటి ఫీచర్లు ఉండనున్నాయి.? ధర ఎంత..? తదితర వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. ఇప్పటి వరకు ఈ ఫోన్‌కు సంబంధించి కంపెనీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే నెట్టింట మాత్రం ఈ ఫోన్‌కు సంబంధించిన ఫీచర్లు వైరల్ అవుతున్నాయి. ఫోన్‌కు



సంబంధించి వెనుక ప్యానెల్‌తో పాటు హ్యాండ్-ఆన్ ఇమేజ్‌లను చూపించే రెండు రెండర్‌లను మాత్రం కంపెనీ షేర్ చేసింది. ఆ ప్రకారం ఫోన్ ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్‌ను కలిగి ఉందని తెలుస్తోంది. ఈ ఫోన్‌ను వైట్, బ్లాక్ కలర్‌లో తీసుకురానున్నారని సమాచారం. ఇక ఫీచర్ల విషయానికొస్తే ఇందులో ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్‌ను అందిస్తున్నారు. మెయిన్ కెమెరాతోపాటు అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా, మాక్రో కెమెరాలు ఉండనున్నాయి. ఇక ఈ స్మార్ట్ ఫోన్‌లో క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్3 ప్రాసెసర్‌ను అందించనున్నారు. నెట్టింట లీక్ అయిన సమాచారం ప్రకారం ఈ ఫోన్‌లో 200 మెగాపిక్సెల్స్‌తో కూడిన రియర్ కెమెరాను ఇవ్వనున్నారని తెలుస్తోంది. అలాగే ఈ ఫోన్‌లో 6.67 ఇంచెస్‌తో కూడిన ఓఎల్ఈడీ స్క్రీన్‌ను ఇవ్వనున్నారు. 120 హెచ్‌జెడ్ రిజల్యూషన్ ఈ స్క్రీన్ సొంతం. అలాగే ఈ స్మార్ట్ ఫోన్‌లో 16 జీబీ ర్యామ్‌ను ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఈ స్మార్ట్ ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పని చేస్తుంది. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఈ స్మార్ట్ ఫోన్‌లో 90 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేసే బ్యాటరీని ఇవ్వనున్నారని తెలుస్తోంది.

# సొంత ఇలాకాలో మురిసిన ముంబై

పదిహేడో సీజన్‌లో హ్యాట్రిక్ ఓటములతో నిరాశపరిచిన ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. సొంత స్టేడియమైన వాంఖడేలో గర్జించిన హార్దిక్ పాండ్యా సేన ఢిల్లీ క్యాపిటల్స్ ను వణికించింది. సమిష్టి ప్రదర్శనతో పంత్ సేనపై 29 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత పవర్ హిట్టర్లు రోహిత్ శర్మ(49), టిమ్ డేవిడ్(45)లు చెలరేగి కొండంత స్కోర్ అందించగా.. ఆతర్వాత బౌలర్లు ఢిల్లీ బ్యాటర్ల భరతం పట్టారు. భారీ ఛేదనలో యువకెరటం ట్రిస్టన్ స్టబ్స్(71), విధ్వంసక ఓపెనర్ పృథ్వీ షా(66)లు హాఫ్ సెంచరీతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. వరుసగా రెండో మ్యాచ్‌లో రెండొందల పైచిలుకు లక్ష్య ఛేదనకు దిగిన ఢిల్లీకి ఆదిలోనే షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న డేంజరస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్(10) ఔటయ్యాడు. రొమారియో షెపర్డ్ బౌలింగ్‌లో సిక్సర్ బాదిన వార్నర్.. ఆ తర్వాత స్లో డెలివరీకి పాండ్యా చేతికి చిక్కాడు. దాంతో, 22 పరుగుల వద్ద ఢిల్లీ తొలి వికెట్ పడింది. వార్నర్ ఔటైనా షా జోరు తగ్గలేదు. 31 బంతుల్లోనే ఫిఫ్టీ బాది ఢిల్లీ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. యువ బ్యాటర్ అభిషేక్ పొరెల్(44) సైతం దూకుడుగాగా ఆడాడు అయితే.. బుమ్రా సూపర్ యార్కర్‌తో షాను బౌల్డ్ చేసి ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. అనంతరం స్టబ్స్(71) ఒంటరి పోరాటం చేసినా అతడికి సహకారం అందలేదు. దాంతో, ఢిల్లీ 200 పరుగులకే పరిమితమై వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది.




## నేను బాధపడ్డ సందర్భాలు

# ఆ రెండే.. యూట్యూబ్ షోలో కార్తిక్


ఐపీఎల్ 17వ సీజన్‌తో టీమిండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ మళ్లీ ఫినిషర్‌గా అవతరామెత్తాడు. అనుభవజ్ఞుడైన కార్తిక్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కు లోయర్ ఆర్డర్‌లో కొండంత అండగా నిలుస్తున్నాడు. తాజాగా అతడు తన కెరీర్‌కు గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్ పై ఓటమి అనంతరం కార్తిక్ యూట్యూబ్ షో కుట్టి స్టోరీస్ లో స్పిన్ లెజెండ్ రవిచంద్రన్ అశ్విన తో మాట్లాడాడు. తన కెరీర్‌లో పశ్చాత్తాపానికి గురైన సందర్భాలు రెండే రెండు ఉన్నాయని చెప్పాడు. 'నా సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో బాధపడ్డ సందర్భాలు ఆ రెండే. ఒకటి ముంబై ఇండియన్స్ నన్ను అట్టిపెట్టుకోలేదు. నా కెరీర్‌కు ఎంతో మేలు చేసిన ముంబై ఫ్రాంచైజీ అలా వదిలేస్తుందని ఊహించలేదు. ఇక రెండోది ఏంటంటే.. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడాలని ఉంది. కానీ, ఇప్పటివరకూ ఆ కల నెరవేరలేదు' అని కార్తిక్ వెల్లడించాడు. అంతేకాదు ఆర్సీబీ అభిమానులు ఎంతో విధేయత గలవారని కార్తిక్ చెప్పాడు. 'ఐపీఎల్‌లో



బెంగళూరు ఫ్యాన్స్ చాలా విధేయులు. వాళ్లు మేము ఒక కుటుంబం. ఆనందంలో, బాధలోనూ వాళ్లు ఎప్పుడూ వెన్నంటే ఉంటారు. ఏమీ జరిగినా సరే వాళ్లు సపోర్టు చేయడం మాత్రం ఆపేయరు. నేను బ్యాటింగ్‌కు వెళ్తుంటే కార్తిక్.. కార్తిక్ అంటూ గట్టిగా అరుస్తూ నాలో ఉత్సాహం నింపుతారు' అని కార్తిక్ చెప్పుకొచ్చాడు.

## స్పోర్ట్స్

# విజయాల హ్యాట్రిక్ కొట్టిన లక్నో



పదిహేడో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విజయాల హ్యాట్రిక్ కొట్టింది. సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్‌పై 33 పరుగుల తేడాతో గెలుపొందింది. మార్కస్ స్టోయినిస్(58), నికోలస్ పూరన్(32 నాటౌట్)ల విధ్వంసంతో స్వల్ప స్కోర్ చేసినా.. బౌలింగ్‌లో అదరగొట్టి గుజరాత్ టాప్‌గన్స్‌ను 130కే కట్టడి చేసింది. యశ్ ఠాకూర్(30/5), కృనాల్ పాండ్యా(11/3)లు అద్భుత స్పెల్‌తో లక్నోను గెలుపు వాకిట నిలిపారు. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన గుజరాత్‌కు రాహుల్ తెవాటియా(30) మెరుపులతో ఆశలు చిగురించినా.. ఠాకూర్ ఆఖరి రెండు వికెట్లు తీసి లక్నో విజయఢంకా మోగించాడు.






# శ్రీరామనవమి కానుకగా వస్తున్న సత్యం రాజేశ్ ‘టెనెంట్’

టాలీవుడ్ నటుడు సత్యం రాజేశ్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. సత్యం సినిమాతో అద్భుతమైన కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రాజేశ్.. ఆ తర్వాత కామెడియన్‌గా తనకంటూ సెపరేట్ ఇమేజ్ సంపాదించుకున్నాడు. ఇక ఈ కామెడియన్ హీరోగా మారిన విషయం తెలిసిందే. గతేడాది ‘మా ఊరి పొలిమేర’ 2 అంటూ వచ్చి సూపర్ హిట్ అందుకున్నాడు. ‘మా ఊరి పొలిమేర’కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం బ్లాక్ మేజిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఈ సినిమా అనంతరం సత్యం రాజేష్ వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. తాజాగా రాజేష్ నటిస్తున్న తాజా చిత్రం టెనంట్ ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్‌గా వస్తున్న ఈ చిత్రానికి వై.యుగంధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా విడుదల తేదీ అనౌన్స్ చేసింది. ఈ సినిమాను శ్రీరామనవమి కానుకగా ఏప్రిల్ 19న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రాన్ని మహాతేజ క్రియేషన్స్ బ్యానర్ పై మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రవీందర్ రెడ్డి .ఎన్ సహా నిర్మాత. మేఘా చౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సాహిత్య సాగర్ సంగీతం అందిస్తున్నారు

# సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని నేను కొనట్లేదు



బాలీవుడ్ హీరోయిన్ ఆదా శర్మ ప్రస్తుతం వరుస బ్లాక్ బస్టర్‌లను అందుకుంటుంది. గతేడాది ‘ది కేరళ స్టోరీ’తో మంచి సక్సెస్ అందుకున్న ఈ భామ ఈ ఏడాది ‘బస్తర్’ మూవీతో మరో హిట్‌ను ఖాతాలో వేసుకుంది. అయితే ఈ భామ తాజాగా దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని కొనుగోలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారీ ధరకు ఈ ఇంటిని ఆదా శర్మ దక్కించుకుబోతున్నట్లు పలు కథనాలు వెలుబడ్డాయి. అయితే ఈ వార్తలపై తాజాగా ఆదాశర్మ స్పందించింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న ఆదా శర్మ.. మీరు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఇంటిని కొనుగోలు చేస్తున్నారా.. అని యాంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఈ భూమ్మీద లేని వ్యక్తి గురించి ఇష్టం వచ్చినట్లు రాయడం, మాట్లాడటం కరెక్ట్ కాదు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ గొప్ప నటుడు. మంచి సినిమాలు తీశారు. సుశాంత్ గౌరవాన్ని కాపాడటం మనందరి బాధ్యత. సుశాంత్ ఇంటిని నేను కొనడానికి వెల్లలేదు. కేవలం చూడడానికి మాత్రమే వెళ్లాను. కానీ మీడియా నేను కొనుగోలు చేస్తున్నట్లు రాసింది. ఒకవేళ ఇల్లు కొనాలి అనుకుంటే ముందు మీడియా వాళ్ళకి చెబుతా అప్పటివరకు వెయిట్ చేయండి. ప్రస్తుతం ప్రేక్షకుల గుండెల్లో ఉన్న అందుకే ఇల్లు అవసరం లేదు అంటూ ఆదా శర్మ వెల్లడించింది.




# గెట్ రెడీ ఫ్యాన్స్ ‘పుష్ప 2’ టీజర్ రిలీజ్ టైం ఫిక్స్


ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ ఏదైనా ఉందా? అంటే అది పుష్ప-2 అనే చెప్పాలి. లెక్కల మాస్టార్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్‌లో 2022 డిసెంబర్‌లో వచ్చిన పుష్ప సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తగ్గేదేలే.. అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ దేశవ్యాప్తంగా సినీ అభిమానులకు తెగ నచ్చేసింది. ఇక ఈ సినిమాకు కొనసాగింపుగా పుష్ప.. ది రూల్ అనే చిత్రం వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ అప్‌డేట్ ఇచ్చారు ఈ రోజు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులకు బర్త్‌డే ట్రీట్ ఇవ్వనున్నారు మేకర్స్. ఇందులో భాగంగానే ఈ మూవీ టీజర్‌ను ఈ రోజు ఉదయం 11.07 గంటలకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# నానితో రొమాన్స్ కు రెడీ అంటున్న పూజాహెగ్డే



టాలీవుడ్ లో ఎప్పటికప్పుడు కొత్త కాంబినేషన్స్ పుట్టుకొస్తుంటాయి. అయితే ప్రేక్షకులు కూడా కొత్త కాంబినేషన్స్ పట్ల ఆసక్తి చూపుతుండటం.. కథ, కథనాల కారణంగా దర్శక నిర్మాతలు కూడా ఎప్పుడూ చూడని కలయిపై ఫోకస్ చేస్తుండటంతో టాలీవుడ్ లో తరుచుగా కొత్త కాంబినేషన్స్ సెట్ అవుతున్నాయి. తాజాగా యంగ్ హీరో నానితో టాలీవుడ్ బుట్టబొమ్మ పూజాహెగ్డే రొమాన్స్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాలీవుడ్ టాక్. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమాలో నాని పూజా హెగ్డేతో రొమాన్స్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం రిఫ్రెషింగ్ కాస్టింగ్ కావాలని నిర్మాత కోరారని, గతంలో నానితో కలిసి పని చేయకపోవడంతో పూజా హెగ్డేతో సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలోనే క్యాస్టింగ్ ను ఖరారు చేస్తామని చిత్ర వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పూజా హెగ్డే యంగ్ హీరో నాగచైతన్యతో మరో సినిమా కోసం డిస్కషన్స్ లో ఉండగా యంగ్ హీరోలు బిటౌన్ భామతో కలిసి నటించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పూజా హెగ్డే అందం, పాపులారిటీ చెక్కుచెదరలేదని, చాలా మంది యంగ్ స్టార్స్ పూజాతో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో నటించిన పూజా హెగ్డే.. 2024లో టాలీవుడ్ లో తన సెకండ్ ఎంట్రీలో ప్రకంపనలు సృష్టిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పూజా తెలుగులో మంచి ఆఫర్ల కోసం వెతుకుతోందని, కొన్ని ఇంట్రెస్టింగ్ రోల్స్ కోసం కూడా ఆమె ప్రయత్నిస్తోందని అంటున్నారు. గత సంవత్సరం వరుస సినిమాలు చేసిన పూజా హెగ్డేకు సరైన సక్సెస్ ఇవ్వకపోవడంతో కొంతకాలం టాలీవుడ్ దూరంగా ఉంటుంది. కొత్త సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయినా సోషల్ మీడియాలో సందడి చేస్తూ టచ్ లో ఉంటుంది. ఈ నేపథ్యంలో 2024లో గ్రాంగ్ గా రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది ఈ బ్యూటీ.

# రూ.100 కోట్ల క్లబ్‌లో టిల్లు స్క్వేర్’




స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం టిల్లు స్క్వేర్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఈ సినిమా మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ మీద దండయాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ డే రోజే వరల్డ్ వైడ్‌గా రూ. 23.7 కోట్ల రాబట్టిన ఈ చిత్రం మూడు రోజుల్లో రూ.50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా ఈ సినిమా 10 రోజుల్లో రూ.101 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఈ విషయాన్ని సితార ఎంటర్‌టైనమెంట్స్ సోషల్ మీడియాలో రాసుకోచ్చింది. డీజే టిల్లుకు సీక్వెల్‌గా ఈ మూవీ రావడంతో ప్రేక్షకులు ఎగబడి ఈ సినిమాకు వెళుతున్నారు. ఇక రానున్న4 రోజులు ఉగాది, రంజాన్ పండుగలు ఉండడంతో ఈ సినిమా కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. మలయాళీ భామ అనుపమ పరమేశ్వరన్ కథనాయికగా నటించిన ఈ చిత్రంను మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సితారా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించారు. శ్రీ చరణ్ పాకాల, రామ్ మిరియాల సాంగ్స్?, తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అందించారు. ప్రిన్స్, మురళిధర్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.